# మరోతరం

ఆఖరి నిముషం వరకు ఆలోచనే. ఇంచుమించు రైలు కదులుతుండగా కంపార్టుమెంటులో కాలుపెట్టాడు వినయ్. ప్రయాణీకుల రద్దీ ఎక్కువగా వుంది. కూచునే అవకాశంలేదు. రోజూ రైలు ఎక్కగానే సీటుకోసం ఆత్రపడేవాడు వినయ్. సీటు దొరగ్గానే పుస్తకం తీసుకుని అవసరమైన లెసన్ చదువుకునేవాడు. గంట రైలు ప్రయాణాన్ని చదువుకోనం వీలున్నంతగా వినియోగించాలన్న తాపత్రయం. ఇవాళ సీటు దొరకనందుకు బెంగగా లేదు. ఏదో దిగులు, తెలియని కంగారు.

ఓ పక్కకి సర్దుకుని నిలుచున్నాడు. ఎదురుగా సీట్లోవున్న ముసలాయన చిరు నవ్వుతో పలకరింపుగా చూశాడు. వచ్చీరాని నవ్వు నవ్వి తలపక్కకి తిప్పాడు వినయ్. రోజూ ఎక్కే రైలే... కానీ కంగారుగా వుంది. పరిస్థితి అలాంటిది.

కిటికీ దగ్గర సీటులో కూచున్న అమ్మాయిమీద వినయ్ చూపు నిలిచిపోయింది. చిత్రమైన అందం. గుండ్రటి ముఖం, చెవులకి

చిన్నరింగులు... గాలికి గమ్మత్తుగా ఎగురుతున్న జుట్టు... లంగా, ఓణీతో... 'పల్లెటూరు పిల్లో... లేక సింపుల్‌గా, సాదాసీదాగా ఉండటం ఇష్టమో' వినయ్ కావాలనే బలవంతంగా కళ్ళు తిప్పుకున్నాడు.

తనున్న పరిస్థితి ఏమిటి . ఇరవై ఏళ్ళ వయస్సుకి తగిన ఆలోచనే...కాని తప్పనిపించింది వినయ్‌కి. ఈ ఆలోచనలేమిటి?'అనుకున్నాడు తల మరోవైపు తిప్పుతూ...

అబ్బాయీ అమ్మాయీ ఇద్దరు జీన్స్ వేసుకున్నారు...తెలిసున్నవాళ్ళే....తన కాలేజీ వాళ్ళే ఆ అమ్మాయి చెయ్యి తన రెండు చేతుల మధ్య పెట్టుకుని గట్టిగా రాస్తున్నాడు ఆ అబ్బాయి. ఆ అమ్మాయి గోముగా చూస్తూ ఏవో చెపుతోంది. మళ్ళీ తల తిప్పుకున్నాడు వినయ్.

'ఎవరయినా అమ్మాయి.. తనతో కూడా ఇలా దగ్గరగా, చనువుగా వుండే రోజు వస్తుందా? వస్తే... వచ్చినా... అంతకన్నా ముందు' చిత్రమైన గగుర్పాటు భయం కలిగాయి వినయ్‌కి. ఎదురుగా వున్న ముసలాయన కొంచంగా జరిగి వినయ్‌ని కూచోమన్నట్టు సైగ చేశాడు. చోటు చాలా తక్కువ. ఫరవాలేదు నిలబడతానన్నట్టు సైగచేశాడు వినయ్.

'తన ఈడు... తనలాగే చదువుకుంటున్న మనవడో, మనవరాలో వున్నారేమో ఆయనకి' అనుకున్నాడు.

తాత మనవలు, తల్లీ తండ్రి పిల్లలు... ఎటువంటి ప్రేమ... ఎంతటి బంధం సామాన్య జీవితాలలో ... అకస్మాత్తుగా తండ్రి గుర్తుకొచ్చాడు వినయ్‌కి. గంట క్రితమే... చిన్న పిల్లాడిలా తల దించుకుని...'డబ్బుల్లేవురా వినయ్... ఇవాళకుదర్లేదు... నీ సీజన్ టిక్కెట్టు టైము అయిపోయిందని తెలుసు. అయినా నా వల్ల కాలేదు. పోనీ రెండుమూడు రోజులు కాలేజీ మానేసేయి' పలుకలేక పలికినట్టుంది తండ్రిగొంతు.

తండ్రి దైన్య స్థితి, బాధ వినయ్‌ని పూర్తిగా ముంచేశాయి. తండ్రి ముందునుంచి ఇవతలకి... తమ ఆర్థిక బాధల్లోకి అరవై అయిదేళ్ళ వయసులో తండ్రి పడుతున్న శారీరక శ్రమలోకి...తన సీజన్ టికెట్‌కి డబ్బు ఆరోజు ఇవ్వలేని తండ్రి బాధలోకి వచ్చేశాడు వినయ్. ఆ క్షణం తర్వాత మొదలైంది ఆలోచన.

కాలేజీకి వెళ్ళటమా? మానటమా? చివరి నిముషం వరకూ ఆలోచించి, ఆఖరికి కాలేజీ మానటం ఇష్టంలేక టికెట్ లేకుండానే రైలు ఎక్కాడు వినయ్.

ఈ రైలులో టికెట్ చెకింగ్ స్క్వాడ్ రోజూ తనిఖీ చేస్తూనే వుంటారు. రైలు ఎక్కిందగ్గర్నించీ అదీ కంగారు. ఈ మధ్య రైల్వే వాళ్ళు జరిమానా వందలనుంచి వేలకి పెంచారని కూడా వినయ్ విన్నాడు.

టికెట్ లేకుండా దొరికితే జరిమానా కట్టే పరిస్థితి లేదు. ఏ స్నేహితుడి దగ్గరైనా అప్పుచేసినా తీర్చగలిగే పరిస్థితులు లేవు. గుండె దడదడలాడుతోంది. తలలోంచి చెమటలు పట్టి అరికాళ్ళు, అరిచేతులు చల్లబడుతున్నాయి. ఏం జరుగుతుందో తెలియనట్టుంది సయమం. ఇరవై ఏళ్ళ ఆ చదువుకునే మనసుని నేరం, జరిమానా, జైలు అన్న భయాలు ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. జరిమానా చెల్లించలేక జైలుకి వెళ్ళాల్సివస్తే... ఆ ఆలోచనకే భయం వేస్తోంది.

నిముష నిముషానికి తనలోకి తను కుంచించుకుపోతూ, ప్రతి చప్పుడికీ భయ పడుతూ, కొత్త వ్యక్తి కంపార్టుమెంటులోకి తొంగి చూస్తే చాలు బెదిరిపోతూ గంటా పదినిమిషాలు ప్రయాణం చేసి చివరికి నగరం చేరాడు వినయ్, గడిచింది అంతే సమయం అయినా, ఒక జన్మ గడిచినంత యాతనపడ్డాడు. కాలేజీ చేరాక కూడా చాలా సేపటివరకూ దడ తగ్గలేదు. క్లాసులో పాఠాలు కూడా రోజూ అంత శ్రద్ధగా వినలేకపోయాడు.

××××

చెప్పాల్సిందంతా చెప్పేశాక....'మరి నీఇష్టం' అన్నాడు ఆచారి. ఆచారి పూర్తి పేరు వెంకటాచారి. వినయ్ క్లాస్‌మేట్.

ఈ మధ్యనే ఎవరైనా నీ పేరేమిటంటే 'వెంకట్' అని చెపుతున్నాడు. తప్ప, గతంలోలా పూర్తిగా వెంకటాచారి. అని చెప్పటం లేదు.

వినయ్ ఆలోచనలోపడ్డాడు. ఆచారి చెపుతున్నది బాగానే వుంది. కానీ మనసులో ఏదో జంకు, సందేహం... ఏం చెయ్యాలో నిర్ణయం కావటంలేదు.

'మరీ అంత ఆలోచించాల్సిందేం లేదురా వినయ్... కొత్తలో సందేహంగానే వుంటుంది. నీకే కాదు. మనలాంటి వాళ్ళందరికీ అంతే, మనం వున్న పరిస్థితుల్లో చదువు మరింత వీలుగా సాగాలంటే, నాకు తెలిసి ఇదొక్కటే దారి' అన్నాడు ఆచారి తిరిగి.

సాయంత్రానికల్లా వినయ్ నిర్ణయించేసుకున్నాడు. ఆచారితో వెళ్ళి ఆ రాత్రే చేరిపోయాడు. నెలకి పదిహేనువందలు జీతం. టిప్స్‌వల్ల మరికొంత వస్తుంది.

రాత్రి భోజనం అక్కడే. వారానికి ఒకరోజు సెలవు. సెలవరోజు పని చేసినా రెండు డ్యూటీలు చేసినా వేరే ఇస్తారు. నాలుగైదు రోజులు స్నేహితుడి రూమ్‌లో వుండి చదువుకుంటానని తండ్రి ఆఫీసుకి ఫోన్‌చేసి చెప్పాడు వినయ్. అంతే తప్ప విష్ణుబార్ అండ్ రెస్టారెంట్‌లో ఉద్యోగంలో చేరానని చెప్పలేదు.

మొదటి మూడు రోజులు ఉద్యోగం చాలా కంగారనిపించింది. గ్లాసులు, ప్లేట్లు,

ట్రే పట్టుకోటం కష్టమైంది. టేబుల్ దగ్గర వాళ్ళిచ్చే ఆర్డరు ఒకటికి రెండుసార్లు అడగాల్సి వచ్చింది. అలా అడుగుతుంటే విసుక్కున్నారు.

కూడా ఆచారి ఉండటంవల్ల. పని వీలుగా నేర్పుతూండటం వల్ల వారం తిరిగేటప్పటికి కొత్తపోయింది. మరో వారానికల్లా పూర్తిగా అలవాటుపడిపోయాడు. కానీ శరీరమే అలసటకి తట్టుకోలేకపోతోంది. పగలంతా కాలేజి. సాయంత్రం ఆరునుండి రాత్రి పన్నిండింటివరకూ బార్‌లో ఉద్యోగం. మేడమీద గార్డెన్ సెక్షన్ అవటం వల్ల మెట్లు ఎక్కిదిగటం.

వినయ్ అలసట చూసి... 'నెల తిరిగేవరకూ ఇలాగే వుంటుంది. అలసటేకాదు... దానికితోడు మనని బాధపెట్టే కోపతాపాలు, చికాకులుఉండనే వుంటాయని' చెప్పి... ఎవరు ఏమన్నా ఎలా ఎంతవరకూ పట్టించుకోవాలో తరుచుగా ధైర్యం చెపుతూవచ్చాడు ఆచారి.

ఊర్నించి కాలేజీకి వచ్చి వెళ్ళటం, గంట ప్రయాణం రావటం, వెళ్ళటం రోజూ తప్పుతుంది. అలసట తగ్గితే మరింత బాగా చదువుకోవచ్చనుకున్న వినయ్‌కి, ఈ ఉద్యోగం అలసటతో చదువు అసలు సాగటం లేదు. పుస్తకం తెరిస్తే చాలు నిద్ర వచ్చేస్తోంది. చాలా దిగులుపడ్డాడు. కానీ ఆచారి చెప్పినట్టు నెలదాటేటప్పటికి పరిస్థితి చాలా మెరుగుపడింది. చాలా రకాల బెరుకూ తగ్గింది.

వినయ్‌కి ఇప్పుడు వున్న బెంగలు రెండే... ఒకటి తల్లీ తండ్రికి ఈ విషయం చెప్పి ఒప్పించటం. దానికన్నా ఎక్కువుగా తోటి వాళ్లుగానీ, తన ఊరివాళ్ళుగానీ, ఎప్పుడైనా తనని ఈ అవతారంలో చూస్తే ఎలా అని

తనక్లాస్‌లోని ఏ ఒక్క స్టూడెంట్ చూసినా కాలేజీ అంతా అల్లరి. ఈ రకం బెరుకు వున్నా ఎక్కువగా ఆ విషయం గురించే ఆలోచన సాగే తీరికలేక పోవటం వల్ల వినయ్ బాగానే గడుపుతున్నాడు. మధ్యలో రెండు మూడు సార్లు తండ్రితో ఫోన్‌లో మాట్లాడాడు తన ఊరి వాళ్ళువస్తే తనకి కావల్సిన బట్టలు, పుస్తకాలు ముందే తెప్పించుకున్నాడు. ఈ నెలాఖరులోపైనా ఇంటికి వెళ్ళాలనుకున్నాడు. అలాగే వెళ్ళాడు.

తల్లిని తండ్రిని కూచోపెట్టి వివరంగా విషయమంతా చెప్పి, తను చేస్తున్న ఉద్యోగం, జీతం వివరాలు చెప్పి తండ్రిచేతిలో రెండువేలుపెట్టి 'నాతొలి సంపాదన నాన్నా' అన్నాడు వినయ్.

ఆయనకి మాట పెగలలేదు. రెండు నిముషాల తర్వాత... 'నా చేతకానితనం వల్లే కదరా... నీకింత కష్టం' అన్నాడు. నిశ్శబ్దంగా తల్లీ. తండ్రీ కన్నీళ్ళు చూస్తూ కాస్సేపు కూచున్నాక... 'మీరు వద్దంటే మానేస్తాను... కానీ ఇలా బాధపడితే చూళ్ళేను' అన్నాడు వినయ్. ముగ్గురి కళ్ళు తడి అయినా వినయ్ చివరికి తృప్తిగానే ఇంటినుంచి తిరిగి వచ్చాడు. వినయ్ ఉండగానే ఓ అప్పుకి ఆ రెండు వేలుకట్టి కొంత బరువు దింపుకున్నాడు

వినయ్ తండ్రి.

వినయ్‌కి ఓ బెంగ తీరింది. చాలావరకూ దిగులూ తగ్గింది. కాలేజీలోనూ, ఉద్యోగంలోనూ ఉత్సాహంగా వున్నాడు. కానీ బార్‌లో ఎవరైనా తెలిసున్నవాళ్ళ కళ్ళపడతానేమో అన్న బెరుకు, అది అవమానం... ఎలా అన్న జంకు పోలేదు.

ఏ పనికైనా కొన్ని సులువులు, మెలకువలూ వుంటాయి. బార్ విషయంలో మేనేజిమెంట్‌కి, కష్టమర్స్‌కి ముఖ్యంగా కావల్సింది వారివారి ఈగో దెబ్బతినకుండా వుండటం. చిరాకు అన్నది ఆ వాతావరణానికి పనికి రాని విషయం. ఇది గ్రహించిన వినయ్ ప్రవర్తన అందరికీ ఇష్టంగా వుంది. ఎప్పుడూ నవ్వుతూ ఓపిగ్గా పనిచేసే అతనంటే అభిమానం.

ఆ రోజు, రోజులాగే ఉద్యోగానికి వచ్చాడు వినయ్. వాతావరణం మబ్బుమబ్బుగా వుంది. పావుగంట గడవకముందే పెద్ద వర్షం మొదలైంది.

ఆచారికి ఆరోజు సెలవు. తన టేబుల్స్ దగ్గర కష్టమర్స్ లేకపోవటంతో ఓ మూలగా గోడకి ఆనుకుని నిలబడ్డాడు వినయ్.

అరగంట సేపు గట్టిగా కురిసింది వర్షం. వర్షం వెలిసీ వెలుస్తుండగా వాళ్ళుముగ్గురూ వచ్చారు.ఎదురుగా వెళ్ళి వినయ్..."రండి సార్" అన్నాడు. అతని టేబుల్ దగ్గరే కూచున్నారు.

కొద్దిగా తడిసినవాళ్ళు తుడుచుకోవటానికి నేప్‌కిన్స్ ఇచ్చాడు వినయ్. మంచినీళ్ళు ఇచ్చి, ఆర్డర్ కోసం నిలబడ్డాడు. ముగ్గురిలో ఒకాయన అరవైదాటిన ఆయన. మిగిలిన ఇద్దరూ నడివయసు వాళ్ళు.

తనకి వేరే పనిలేక ఖాళీగా ఉండటంవల్ల మరింత శ్రద్ధగా సర్వ్‌చేశాడు వినయ్. ముగ్గురూ మంచి సరదాగా వున్నారు. ఎంతో మృదువుగా మాట్లాడుతున్నారు.

ఈ ఉద్యోగంలో చేరాక రకరకాల అనుభవాలు ఎదురయ్యాయి వినయ్‌కి. కొంతమంది చాలా మొరటుగా, కోపంగా వుంటారు.

కొంతమంది స్టూడెంట్స్ తన ఈడువాళ్ళే చాలా అసహ్యపు కబుర్లు చెప్పుకుంటూ, చాలా చిరాకు కలిగిస్తారు. ఉద్యోగాల్లో చేరినవాళ్ళు, లేనివాళ్ళు ,ఇలా రకరకాలు, తనని తక్కువస్థాయి వ్యక్తిగా చూసేవాళ్ళే ఎక్కువ.

ఖాళీగా వుండటమే కాక ఇవాళ ఈ ముగ్గురితో హాయిగా వుంది వినయ్‌కి. మాటల మధ్యలో అకస్మాత్తుగా పెద్దాయన అడిగాడు వినయ్‌ని "చదువుకుంటున్నావు కదూ..." అని. వినయ్ అవునన్నట్టు తలూపాడు. ఆ తర్వాత ...ఉద్యోగంలో ఎందుకు చేరావు? జీతం ఎంత వస్తుంది? చదువు బాగా సాగుతోందా? లాంటి వివరాలన్నీ

తెలుసుకున్నారు.

బయోటెక్నాలజీ కోసం సిటీకి వచ్చి చదువుకుంటున్నందుకు ముచ్చటపడ్డారు. ఉద్యోగంలో చేరినందుకు మంచిపని చేశావన్నారు.

"పరిస్థితుల్ని అర్థం చేసుకుని, ఇలాంటి నిర్ణయం తీసుకున్నందుకు మీ అమ్మా నాన్నే కాదు, నీలాంటి పిల్లల విషయంలో అందరు తల్లిదండ్రులు గర్వపడాలి."

"అందరం కష్టపడి, శ్రమపడి నిలదొక్కుకున్న వాళ్ళమే. ఏమాత్రం చిన్నతనంగా ఫీలవకు" ఇలా ఆ ముగ్గురూ మాట్లాడిన మాటలు వినయ్‌కి అమృతపు చినుకుల్లా అనిపించాయి.

"అవమానం, చిన్నతనం చాలా బాధపెడతాయి. అందరికన్నా మనం గొప్పగా వుండాలనుకోవటం అతి సహజం. అలాగే అవమానం ఎదురైనా, మనని చిన్నతనంగా చూసినా బాధే. కానీ ఆ బాధకన్నా ఆ పరిస్థితి వస్తుందేమోనన్న జంకు చాలా చాలా ఇబ్బంది.

నీ మాటలద్వారా, నీ పరిస్థితి నాకు అర్థమైంది. ఎవరుచూసినా, ఎవరు ఏమన్నా నువ్వు తక్కువగా ఫీలవని ధీమాతో నిలబడు. ఒకవేళ అలా చెయ్యలేననుకుంటే ఉద్యోగం మానేసి ఇదివరకటిలానే ఇంటికి వెళ్ళిపో, ఒక్కటి మాత్రం నిజం. షోగ్గా తిరుగుతూ, హీరోల్లా కబుర్లు చెపుతూ, లేదా అన్నీ కలిసొచ్చి పెద్ద స్థాయికి చేరుతూ గర్వపడే కుర్రాళ్ళకన్నా నువ్వే రకంగానూ తక్కువకాదు. నువ్వు చేస్తున్నది కరెక్ట్. ధీమాగా, హాయిగా వుండు" అన్నాడు పెద్దాయన.

ఆ మాటలు విన్నాక వినయ్‌కి ఇంకేం సందేహం, జంకు మిగలలేదు. తనవాళ్ళు ఎవరూలేని ఒంటరి ఆచారి, పరిస్థితి మెరుగుపడటానికి తను, తమలాగే రకరకాల కారణాలవల్ల ఇలా చదువు సాగిస్తున్నవారు ఎందరులేరు? తమ మానావమానాలు వేరు, తమ జీవితం వేరు. తమది వేరే తెగ...తమకి చిన్నతనం లేదు. ఆ రాత్రి తర్వాత ఉద్యోగం, ఆ జీవితం మరింత ధీమాగా, ఉత్సాహంగా మారాయి వినయ్‌కి.

- స్వాతి మాసపత్రిక ఫిబ్రవరి 2006